## బోధన్ అంబేద్కర్ కాలనీలో
# కాంగ్రెస్ విస్తృత ప్రచారం



బోధన్, బతుకమ్మ :బోధన్ పట్టణ 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి పాండురంగారావు ఇంటిం టికి తిరుగుతూ ఓటర్లను కలుసుకుని మద్దతు కోరుతున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు లభిస్తున్న ప్రయోజనాలను తెలియజేస్తూ, ఈ ఒకసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు కాలనీవాసులు, ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా మద్దతు తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మోర్తాడ్, బతుకమ్మ :గ్రామంలోని అన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ప్రజలకు వ్యాధులు సోకకుండా ఉండవచ్చని సర్పంచ్ విజయ్ కుమార్ అన్నారు. మోర్తాడ్ మండలంలోని శెట్ పల్లీ గ్రామపంచాయతీ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న పరిశుద్ధ కార్మికులకు బుధవారం ఉపసర్పంచ్ బడే సాయిరాం, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో సబ్బులు, నూనె, మాస్క్ లు, గ్లౌజ్ లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ పృథ్వీ రాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భాదిత కుటుంబానికి
# సర్వ సమాజ్ ఆర్థిక సహాయం



భీమ్‌గల్, బతుకమ్మ:భీమ్ గల్ పట్టణంలోని దేశ్పాండే గల్లి లోని ఆవుసుల రాజశేఖర్ తల్లి మృతి చెందారు. వారి నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల ఖర్చు నిమిత్తం భీమ్ గల్ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ తరపున రూ. 5000 ఆర్థిక సహాయాన్ని కమిటీ సభ్యులు బుధవారం అందించారు.

## కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు
# షోకాజ్ నోటీసు జారీ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జక్రాన్పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ కు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కేజీబీవీలో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు కలెక్టర్ దృష్టికి రావడంతో తక్షణమే స్పందించారు. స్పెషల్ ఆఫీసర్ ను సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఉదంతంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక అందించాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. విచారణ నివేదిక అందిన మీదట తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ తరహా సంఘటనలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.

# గులాబీ గూటికీ చేరిన మాజీ కౌన్సిలర్లు

## కాంగ్రెస్‌ను వీడిన ఏనుగు రవీందర్ రెడ్డి అనుచరులు
## కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్లు



బాన్సువాడ, బతుకమ్మ : మున్సిపల్ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఫిరాయింపు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి భారీ షాక్ తగిలింది. ఆయన నియోజకవర్గ కేంద్రం బాన్సువాడ పట్టణంకు చెందిన ఆరుగురు అధికార పార్టీ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌ను వీడారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నేత ఎలమంచిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం వారంతా హైదరాబాద్ వచ్చి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇప్పటికే బాన్సువాడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థులు బీ ఫామ్‌లు సమర్పించి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న తరుణంలో తాజా చేరికలతో కాంగ్రెస్ కోట కుప్పకూలినట్టేనని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌కు, బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు చేసిన ద్రోహాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌లో చేరికలతో కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని స్పష్టంచేశారు. బాన్సువాడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లలో బాడి శ్రీనివాస్, లాయక్, అక్బర్, ఖాదర్, గంగారామ్, రైటర్ రాజు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు. ఎట్టిపరిస్థితుల్లో బాన్సువాడ బల్దియాపై గులాబీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు.

# 18వ వార్డ్‌లో బీఆర్ఎస్ జోరు ప్రచారం

## 18వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి పాతిమ జాబిన్



బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ మున్సిపాలిటీలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఫాతిమా జాబిన్ లాయక్ 18వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుంటూ, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తూ, వార్డు అభివృద్ధి కోసం కట్టుబడి ఉంటానని ఓటర్లకు భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి ఉన్న సేవా దృక్పథాన్ని, గత అనుభవాలను ఈ సందర్భంగా ఆమె ప్రజలకు వివరించారు. గతంలో వార్డ్ మెంబర్ గా సేవలందించిన సమయంలో 18వ వార్డు అభివృద్ధికి ఆమె చేసిన పనులను గుర్తు చేశారు. గతంలో తాము చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. తనను గెలిపిస్తే వార్డు ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉండి సేవ చేస్తానని ఫాతిమా జాబిన్ లాయక్ హామీ ఇచ్చారు. సమస్య ఏదైనా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, స్థానిక సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. 18వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి తనకు అవకాశం కల్పించాలని ఆమె అభ్యర్థించారు.

# బీఆర్ఎస్ హయాంలోనే నగరం అభివృద్ధి

## కార్నర్ మీటింగ్ లో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా





నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరం బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద 36, 37, 38, 43 డివిజన్ సంబంధించిన కార్నర్ మీటింగ్లో మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం పచ్చదనంగా ఉండేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. సుభాష్ నగర్ లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో 300 ట్రాన్స్ ఫార్మర్లు, 200 విద్యుత్ పోల్స్ జరిపి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు వేయడం జరిగిందన్నారు. ఇందూరు ఆడ బిడ్డల కోసం ఐటి హబ్ నిర్మించి.. విదేశాలకు వెళ్లి 25 కంపెనీలు తీసుకురావడం జరిగిందన్నారు. 2,000 పెన్షన్, కల్యాణ లక్ష్మి 100,000 ఇచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుదేనన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో నిజామాబాద్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసిందని, నగరమంతా పచ్చదనంగా ఉందంటే అది బీఆర్ఎస్ పాలనలోనే అన్నారు. డివిజన్లలలో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తిచేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, మోడ్రన్ స్మశాన వాటికలు, మినీ ట్యాంక్ బండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, నూతన కలెక్టరేట్, మున్సిపల్ భవనాన్ని నిర్మించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలలో చేసిన అభివృద్ధి ఎక్కడుందో చూపించాలని ప్రశ్నించారు. నిజామాబాద్ నగర ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే ఇప్పటివరకు ఎన్ని నిధులు తీసుకొచ్చారో, ఎంత అభివృద్ధి చేశారో, ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలక్షన్ల కోసం ఊరు పేరు మార్చాలని బీజెపి ప్రభుత్వం రచ్చ చేస్తుందని ఊరు పేరు మారితే కడుపులు నిండుతాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒక కానిస్టేబుల్ ను హత్య చేసిన ఘటన, ఎక్సైజ్ కానిస్టేబుల్ ని కారుతో ఢీ కొట్టి చంపితే శాంతిభద్రతలు కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైం దన్నారు. రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధపు మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని తెలిపారు. రేవంత్ రెడ్డి చెప్పిన మహిళలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, గ్యాస్ సబ్సిడీ రాలేదన్నారు. నిజామాబాద్ నగరంలో మార్కండేయ గుడి, హమాల్ వాడి సాయిబాబా, నాగారంలో పెద్దమ్మ గుడి ఆలయాలను కట్టించిన ఘనత బీఆర్ఎస్ దన్నారు. రాముడు బీజెపికి, కాంగ్రెస్‌కి రాముడు కాదు అందరికీ రాముడే ఆ విషయాన్ని బీజెపి కాంగ్రెస్ వారు తెలుసుకోవాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ అభ్యర్థి దువ్వ వనజ వెంకట్, 37వ డివిజన్ అభ్యర్థి ప్యాట విజయలక్ష్మి, 38 వ డివిజన్ అభ్యర్థి ఎం రాజేష్, 43వ డివిజన్ అభ్యర్థి వెంకటరమణ (బుజ్జి) బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.